ఓమ్.

# మద్యపాననిషేధకీర్తనలు

నీ ప్రాణ మాన ధనములను, నీ మాతృ
దేశమును రక్షింపగోరితే దీనిని తప్పక
చదువుము.

198/1-35

గ్రంథకర్త:
నీలం వెంకయ్య,
వాల్మీకాశ్రమము, వెన్నవల్లివారిపేట,
ఏలూరు.

బ్రహ్మశ్రీ కొత్తపల్లి సుందరరామయ్యగారిచే
పరిశోధింపఁబడినది.

6 వ కూర్పు 1000 ప్రతులు

ఏలూరు శ్రీ పాండురంగ ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

1934.

వెల 0—2—0



గ్రంథకర్త:- నీలం వెంకయ్య,

వాల్మీకాశ్రమము, వెన్నవల్లివారిపేట - ఏలూరు.

# ఆరోగ్యమునకు శత్రువులు.

సీ. సస్యంబు దృష్టిని ♦ నాశంబు గావించు
పొగచుట్ట పెదవులు ♦ పొలుపుఁ జెఱచు
బీడీలు జిహ్వక ♦ ప్రియమాచరించు
సిగిరెట్టు గుండెను ♦ సిథిలపరచు
మద్దత్తు బుద్ధిక ♦ మాంద్యంబు గలిగించు
గంజాయి పిచ్చిని ♦ గలుగజేయు
కాఫీ నరంబుల ♦ కాపత్తు గలిగించు
టీ పైత్యవృద్ధి ఘ ♦ టిల్లజేయు
గీ. మాదుము వివేకమెల్లను ♦ మాటగలుపు
భంగు జ్ఞాపకశక్తిని ♦ భంగపర్చు
అభిని రక్తమాంసంబుల ♦ నార్చివేయు
గాంచ దుర్వ్యసనంబులు ♦ గావెంబివ్వి

ముఖారి—ఆటతాళము.

(ఏదిరా జననమరణము నిజజాడగనిన అనుమాదిరి.)

మానర త్రాగుడుమానర ఓవెర్రిమనసా॥ మా॥

1. ఎన్నివిధముల దెల్పిన నీకున్న దుర్గుణ మిడువవేర। మన్నుపాలయ్యేటి వరకు మానవా యీకల్లుసారా॥ మా॥
2. దిక్కులేని నక్కరీతిగ ఎక్కడెక్కడో తిరిగినీవు । డొక్కనిండగ త్రాగికక్క ఎక్కడో పడిపోకమునుపే॥ మా॥
3. పెద్దలందరు వద్దుకల్లని బుద్ధులెన్నో జెప్పుచుండగ। అద్దుదప్పినడచి నీవు మొద్దువై చెడిపోకమునుపే॥ మా॥
4. బాగుపడెడు విధముదెలియక వాగుచుందువు। త్రాగి ఎప్పుడు। కొంగజపములు జేసికడకు దొంగవై చెడిపోకమునుపే॥ మా॥
5. తల్లిపిల్లల నేడిపించి యిల్లువాకిలమ్మివేసి। ఎల్లకాలము త్రాగితిరిగి అల్లరిపాలవక మునుపే॥ మా।
6. అప్పుజేసి తప్పకుండా ఎప్పుడునీవు త్రాగుచుంటె। వుప్పులేని గంజి త్రాగెడు చిప్పచేతికి రాకమునుపే॥ మా॥

## తూర్పుభజన అడుగుకీర్తన.

కల్లుసార మానర సోదర నీవు । కల్లుసారమానర ॥సో॥

కల్లుసారాత్రాగి కైపెక్కి తిరిగితె । యిల్లువళ్ళుగుల్లరా మానరనీవు ॥క॥

మధుపానమునుత్రాగి మదమైకట బాదులు । మరణమైపోయారురర
మానరనీవు ॥క॥

కడుబలాశాలురుకుంభకర్ణాదులు। త్రాగిపడిపోయారురామానరనీవు ॥క॥

శుక్రాచార్యుడే కచునిబూడిది కల్లులో।కలిపిస్తె త్రాగాడురా మానర
నీవు ॥క॥

బలరాముడే కల్లుత్రాగి మతిచెడిపోయి । కలహములు పెంచాడురా
మానరనీవు ॥క॥

కల్లుత్రాగితే సింహబలుడు భీమునితోడ కలహించి మరణించెరా
మానరనీవు ॥క॥

నీవు చూచుచుండగ ఎన్నెన్నో కొంపలు మన్నై పోయెనురా
మానరనీవు ॥క॥

కల్లుత్రాగితె ఘోరపాపము నరకము । యని ఋషులేవ్రాసారురా
మానరనీవు ॥క॥

నీలం వెంకయ్యదాసు వరదుని సాక్షిగా కల్లుసారా మానరా సోదర
నీవు ॥క॥

---

# పీఠిక.

---

పూర్వము సురాపానము పంచమహాపాతకములలో నొకటిగా నెంచఁబడి యుండెను. దీనికి నిదర్శనముగా నొకపురాణ కథ కలదు. బృహస్పతి కుమారుడైన కచుని రాక్షసులు చంపి దహనముచేసి యాబూడిదను మద్యపానములోఁగలిపి తమగురువగుశుక్రాచార్యునకుఁ ద్రావనిచ్చిరి. తరువాత శుక్రాచార్యుఁడు దీనిని గ్రహించి మద్యపానము ఘోరపాపమని యెల్లరకుఁ దెలిపెను. భారతములోని యీక్రింది పద్యమువలన నది స్పష్టపడుచున్నది.

క. భూసురులాదిగఁ గల జను
లీసుర సేవించిరేని నిది మొదలుగఁ బా
పాసక్తి పతితులగుదురు
జేసితి మర్యాద దీని జేకొనుఁడు జనుల్.

వ. మఱియు సురాపానము సప్తవ్యసనములలో నొకటిగాభావించినట్లు భారతములోని యీక్రింది పద్యమువలన తేటబడుచున్నది.

గీ. వెలఁది జూదంబు పానంబు వేఁట పలుకు
ప్రల్లదంబును దండంబు పరుషదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముచేత
యనెడి సప్తవ్యసనములఁ జనదు తవులు.

వ. ఈ సప్తవ్యసనములలో నొకటియగు మద్యపానమువలన రక్తము మెదడు, నరములు, ఊపిరితిత్తులు, కార్జము మొదలగు అవయవములయొక్క పటుత్వమును తగ్గించి కడకు మృత్యువాతఁ గందఁ జేయును,

సీ. లక్షాధికార్లెల్ల భిక్షాధికార్లైరి
మద్యపానత్వంపు మహిమవలన
భీమబలాఢ్యులు పీన్గులై నిలిచిరి
మద్యపానత్వంపు మహిమవలన
మానాభిమానముల్ మాని నర్తిల్లిరి
మద్యపానత్వంపు మహిమవలన
విజ్ఞానివరులెల్ల రజ్ఞానివరులైరి
మద్యపానత్వంపు మహిమవలన

గీ. అకట ! యీదుష్టపానంబు నవని మీరు
బో నడంచిన దేహంపు పుష్టి బుద్ధి
యాయురారోగ్య పుత్ర పౌత్రాభివృద్ధి
నందెదరు నమ్ముఁడయ్యయో యయ్యలార !

వ. మద్యపానము మానవుని ఆరోగ్యము, ఐశ్వర్యము, జ్ఞానమును దిగమ్రింగి భిక్షకునిగా తయారుచేయును.

---

ఓం.

# మద్యపాననిషేధకీర్తనలు

కీర్తన.

(నీకేలయీగండుతనము-మగడా- అనురీతి.)

కల్లుసారమానవేల । వళ్ళుయిల్లుగుల్లజేసి । గళ్ళుమననేల ॥కల్లు॥ ।

1. తరతరములనుండీ। మారుపాకుండఁగఁ త్రాగి । కరువుకుమూలమైనావు పరువుమర్యాదలను మరచినావు । ఒరులగొప్పజూచి యోర్వలేవు తీర్వలేని యప్పులుచేసుతావు । నీవు తరహుగాని దుఃఖము లనొంది పోయేవు ॥కల్లు॥

2. తల్లిపిల్లలనోట । మన్నుకొట్టినీవు । కల్లుకొట్టుకు నడువనేల । వళ్ళు తెలియకుండగ త్రాగనేల। యిల్లువాకిలి తెగనమ్మనేల।తల్లిదండ్రులు మఱి యేడ్వనేల । యెల్లజనులు నీకై చూడనేల । నేల కీలుబాడిన బొమ్మవలెనీవు బడనేల ॥కల్లు॥

3. అప్పుజేసినీవు తప్పకుండఁగఁ త్రాగి కుప్పిగంతులువేయనేల । యుప్పు పప్పులేదని యేడ్వనేల । చప్పిడిగంజినీవుఁ ద్రాగనేల । రొప్పురోగంబు మఱిహెచ్చనేల । ఎప్పుడింటిలోపల పోరుగోల । నీవుగొప్ప వారిని చూచి దుఃఖపడనేల ॥కల్లు॥

4. పండుగరోజనుచు నిండుగనీవుఁ ద్రాగి తిండిమాని తిరగనేల । కండ్లు తిరిగి క్రిందఁబడనేల । పండ్లురాలి రక్తముగారనేల । నీళ్ళు చల్లి ముఖముగడుగనేల ।గళ్ళుమని తల్లిపిల్లాలుచూచి యేడ్వనేల ॥కల్లు॥

5. రాత్రిపగలుత్రాగి । నీతిదప్పినీవు । కోతిచేష్టలుజేసుతావు । ముంత కల్లుకై యాశించుతావు । ఎన్నిగంతులైనవేసుతావు। యెంతచెప్పిన

గ్రహించలేవు । నీతిమార్గముమరచిపోతావు । నీతిధర్మములన్నియు మంటిలోగలిపేవు ॥కల్లు॥

6. ఇంటనున్నసొమ్ము। లన్నికొదువబెట్టి । గంటగంటకు త్రాగుతావు। తంటలెన్నైన తెచ్చిపెట్టేవు । మాటచెప్పితె వినుపించుకోవు । నోట వచ్చినట్లు బలుకుతావు । వెంటనున్నవారిని జూచుతావు । కొంటి వాదంబులను బెంచి కయ్యంబుదెస్తావు ॥కల్లు॥

7. కాయముస్థిరమని । మాయజనులతోగూడి । హాయిగ త్రాగుట రోత ॥ బుద్ధిదానికై త్రిప్పుటచేత । వచ్చురోగంబుల కెల్లమూల । మానుకుంటె సుఖమునిచ్చుదాత । మానకుంటె వచ్చును ప్రాణఘాత నీ ప్రాణములనుదీసి దుమ్ముజేసెదూత ॥కల్లు॥

8. ముఖముజూడకుండ । సికలుబట్టించినీ। సుఖమంతా హరించుచునన్న। యిరుగుపొరుగుతో తిట్టించునన్న । ప్రాణమానాము హరించుచు నన్న । యిల్లువాకిలి అమ్మించునన్న । మట్టిచిప్ప చేతికిచ్చునన్న ! యీ నీలం వెంకయ్యదాసు బోధనువినకున్న ॥కల్లు॥

## 2. కీర్తన.

ముంతామాయమ్మ।నినుమరువలేనమ్మ।కల్లుముంతామాయమ్మ॥

1. చల్లపెరుగుపాలునీకు సాటిరావమ్మ।నీసారమేమొగాని బల్ సంతోషమోయమ్మ । ఆ పైదుఃఖమోయమ్మ॥ కల్లు॥
2. తన్నులాటకునీవు తల్లివోయమ్మ ।నిను నమ్మకొన్నవారి కిల్లువాకిలి లేదమ్మ । నిలువనీడలేదమ్మ । అన్ని సున్నాలోయమ్మ॥ కల్లు॥
3. ఇరుగుపొరుగునవ్విన నిను మరువలేదమ్మ । నీకరుణవల్ల కడకు రోగినైతినోయమ్మ॥ కల్లు॥
4. కూడుగుడ్డలేక మాడిపోతినోయమ్మ । నీజాడఁగన్నవారికుండ నీడలేదమ్మ॥ కల్లు॥
5. ఇల్లువల్లుగుల్లచేసె తల్లివోయమ్మ । మళ్ళీ నిన్నుతలచుకొన అల్లరోయమ్మ॥ కల్లు॥



6. వందలాదిధనమునీకు నొప్పగించానే । ఉప్పులేని గంజిత్రాగి వడలిపోయానే॥ కల్లు॥
7. వాసిగా నీలం వెంకయ్య దాసుడోయమ్మ । తెల్పినట్టిబోధ వినక చెడితినోయమ్మ॥ కల్లు॥

## 3. కీర్తన - తోహార.

1. సోదరులారా సుఖముగోరితె కల్లుసారమానండి। పతితపావనుని మది దలంచితె కల్లుసారమానండి॥ సోద॥
2. ఆరోగ్యంబుగ నుండఁగోరితే కల్లుసారమానండి। యిరుగుపొరుగుతో యిష్టముగోరితె కల్లుసారమానండి॥ సోద॥
3. శతవర్షంబులు బ్రతుకగోరితె కల్లుసారమానండి । మతధర్మంబుల మనుపగోరితె కల్లుసారమానండి॥ సోద॥
4. పిల్లలనాలిని పెంచగోరితె కల్లుసారమానండి । యిలువాకిండ్లను నిలుపఁగోరితె కల్లుసారమానండి॥ సోద॥
5. తుంటరితనములు ద్రోయగోరితే కల్లుసారమానండి । కొంటెవాదములఁగూల్పగోరితె కల్లుసారమానండి॥ సోద॥
6. ఐకమత్యముతో నలరఁగోరితే కల్లుసారమానండి। మీపైకమంతయును నిలువనెంచితే కల్లుసారమానండి॥ సోద॥
7. బలవంతులరై పరఁగగోరితె కల్లుసారమానండి । పాలు పెరుగు త్రావగగోరితె కల్లుసారమానండి॥ సోద॥
8. అల్లరితనములనణపగోరితె కల్లుసారమానండి । యీనీలం వెంకయ్య నీతినివింటే కల్లుసారమానండి॥ సోద॥

## 4. కీర్తన.

(మహాత్మా గాంధీ దర్శనమే పావనము-అను మాదిరి)

నిన్నుమరచి నిలువలేనమ్మ ఓకల్లుముంతా నిన్నుమరచి నిలువలేనమ్మ ఒకనిమిషమైన నినుమరచి నిలువలేనమ్మ॥

1. అన్నలు తమ్ములు తల్లి తండ్రి నన్నెడబాసినగాని నిన్ను నేను విడువలేనమ్మ ఓ కల్లుముంతా॥ నిన్ను॥

2. తాతలు తండ్రులనాటి పాతిసధనమెల్లపోసి చేతముంతా విడువలే
నమ్మ ఓకల్లుముంతా॥ నిన్ను॥

3. ఆలిపిల్లలు ఏడ్చినగాని యిలువాకలి పోయినగాని కల్లుపాక విడువలే
నమ్మ ఓ కల్లుముంతా॥ నిన్ను॥

4. ఎంతదూరమైనగాని । ముంత చేతపట్టుకో నీ । వెంటకే నేనొస్తానో
యమ్మ । ఓకల్లుముంతా॥ నిన్ను॥

5. వాసిగా నీలంవెంకయ్య దాసుబోధలువినక నీ। దాసుఁడ నై చెడితి
నోయమ్మ । ఓకల్లుముంతా॥ నిన్ను॥

సీ. మేడలు మిద్దెలు మెఱుఁగైన చావళ్ళు
జమీన్లు జాగీరు లమ్మవలయు,
బలునైన గుఱ్ఱముల్ బండిమొద్దుల లక్క
పల్లకీ ల్వేలంబు పాడవలయు,
కంచాలుముంతలు మంచాలుకుర్చీలు
పెట్టియల్ సంతలోఁ బెట్టవలయు,
పట్టుకోకలు పట్టు పుట్టముల్ జలతారు
దట్టీలు తాకట్టు పెట్టవలయు,

తే. గీ. పిదప బిడ్డలనోటను బెడ్డకొట్టి
యవల పెండ్లాము మెడపుస్తె నమ్మవలయు,
మధురసం బభ్యసించిన మనుజపశువ
మానదగునోయి తగదోయి మద్యపాయి.

వ. ఈమద్యపానము దురభ్యాసమువలన మానవుని ఆర్థికస్థితి గతులు సన్నగిల్లుటయె గాక తమపూర్వులచే సంపాదింపబడిన మేడలు మిద్దెలు, మొదలుగాఁగల యావదాస్తిని విక్రయించి పిదప తన ప్రియురాలి సర్వాభరణములనమ్మి తన యింటియందుగల భార్యా పుత్రాదుల నేడ్పించుచు మానవుఁడా? పశువా? అనునంతటి సందేహము గల్పించి చివరకు ద్విపాదపశువని నిర్ధారణచేయఁబడి కూలి నాలి చేసికొనియో, భిక్షమెత్తుకొనియో జీవించునంతటి దుస్థితి



కలిగినపుడు తనపూర్వపు స్థితిగతులు దలంచుకొని యీక్రింది విధముగా విలపించుచుందురు.

### 5. కీర్తన.

రమ్మసార దుమ్ముచేస్తివే । నమ్మించి నన్ను । రమ్మసార
దుమ్ముచేస్తివే॥

1. అమ్మననుచు నమ్మినేను సొమ్ములన్నిఖర్చుపెట్టి । రిమ్మదిరుగ త్రాగు
చుంటినే । ఓరమ్మసార దుమ్ముచేసి పారిపోతివే ॥ఓరమ్మ॥
2. నీకుముక్క కాల్చిపెట్టి ఆకుతోటికూర బెట్టి । రూకలన్నికర్చుపెట్టినే
॥ఓరమ్మసార॥
3. అప్పుసప్పుజేసినేను ఎప్పుడునిను త్రాగుచుంటే । చిప్పచేతి కిచ్చి
పోతివే ॥ఓరమ్మ॥
4. దిక్కునీవేయనుచునాకు మక్కువతో నమ్మినీకు । రొక్కమంతా
ఒప్పగిస్తినే ॥ఓరమ్మ॥
5. పిల్లజల్ల నేడిపించి యిల్లువాకిలమ్మివేసి । నేలపడక పెట్టిపోతివే
॥ఓరమ్మ॥
6. కోడిగ్రుడ్లునంజుతోటి బుడ్డిసారకల్లుతోటి । బడ్డిగించి పారిపోతివే
॥ఓరమ్మ॥
7. రోషవంతుననుచునేను మీసములను దువ్వుచుంటె । గోచిగుడ్డ
పెట్టిపోతివే ॥ఓరమ్మ॥
8. వాసిగా నీలంవెంకయ్య దాసుచెంత చేరనీయక । కోతికూపు చేసి
పోతివే ॥ఓరమ్మ॥

### 6. కీర్తన-బేహాగ్ రాగము.

చాలుచాలు । కల్లుసార చాలించుమిఁకనీవు సోదరా । ఎల్ల
కాలము కల్లుత్రాగి । యిల్లువళ్ళు గుల్లచేయబోకు సోదరా॥

1. చచ్చినపురుగూలు । హెచ్చుగానుండును మచ్చికపడఁబోకుసోదరా
రొచ్చుకల్లుత్రాగి పిచ్చివాడైపోక తక్షణమేమానుసోదరా॥ చాలు॥

2. వంగకాయలపులుసు । బుంగనిండనుపోసి । పొంగించు నీకల్లు సోదరా । ఆసంగతెఱిగినీవు సాగిత్రాగబోకు రోగివై చెడుదువు సోదరా ॥చాలు॥

3. చెట్టునున్నకల్లు । లొట్టిదింపెడువేళ । బొట్టుచెమటలుగారుసోదరా । పిట్టరెట్టాలెన్నో లొట్టిలోపలనుండు । ముట్టబోకు కల్లు సోదరా ॥చాలు॥

4. చెల్లాడములచేత । బల్లూలెన్నోకల్లుకుండల్లో పడియుండుసోదరా కుళ్ళినయీకల్లు వళ్ళూనెల్లజెరచు కల్లుత్రాగబోకు సోదరా । ॥చాలు॥

5. కాకులు గ్రద్దలు మూకలుగాఁజేరి తోకలాడించును సోదరా । పక్షులు ఎన్నెన్నో కక్కిన కల్లూకై మక్కువపడఁబోకు సోదరా । ॥చాలు॥

6. కోడిపిల్లలతోళ్ళు తాడిచెట్లపైని వ్రేలాడుచుండును సోదరా।క్రుళ్ళు ప్రేగులనీరు కల్లులొట్టిలోజారు పాడుకల్లు మానఁసోదరా ॥చాలు॥

7. పురుగులు ఎన్నెన్నో మురిగిన కల్లుకై పరుగులెత్తబోకు సోదరా॥ బూరపెట్టినోరు పీల్చినయీకల్లు సొల్లు యెంగిలిగారు సోదరా ! ॥చాలు॥

8. చీమలు, దోమలు, పురుగులు, పాములకిరవైన యీకల్లుసోదరా రొమ్ముగుల్లాచేసి దుమ్ముచేయునుకల్లు నమ్మబోకు నీవు సోదరా ॥చాలు॥

9. ఎన్నెన్నో కొంపలుమన్నుచేసిన దీనినమ్మబోకు మిపుడేసోదరా । యీనీలం వెంకయ్యదాసు .వరదునిసాక్షిగనేడే కల్లుసారమాను సోదరా ॥చాలు॥

### 7. కీర్తన.

(శంకరాభరణం రాగం.)

ఎల్లకాలము కల్లుత్రాగినీవు కాలముఁ గడుపకురోరన్న।వల్లకాటి పాలవకమునుపే కల్లుమానరా ఓరన్నా ॥



1. మరువక యెప్పుడు త్రాగుచునుంటే కరువుకు మూలంబోరన్నా॥ అరువుచేసినీవు త్రాగుచునుంటే అందఱుతన్నుట నిజమన్నా॥ ఎల్ల॥
2. తన్నులాటలకు తల్లికల్లుయని తప్పకుతిరగర ఓరన్న । కండ్లుమూసి కొని పండ్లిగిలించే పద్ధతిగలుగును రోరన్న॥ ఎల్ల॥
3. ఎప్పటికప్పుడె తప్పాయనుచునీవు తప్పక త్రాగుమఓరన్న ! తప్పక యిప్పుడె మానకయుంటె చప్పిడిగంజే నిజమన్నా॥ ఎల్ల॥
4. తల్లిపిల్లలకు కల్లునేర్పితే అల్లరిబ్రతుకౌ నోరన్న । ఉన్నాగుల్లలు చెల్లినవెనుక మల్లచిప్ప చేతికిరన్నా॥ ఎల్ల॥
5. ఈతకల్లులో విరుగుడు కలదని యిరుకున బడిబోకోరన్న । కోతి గుణంబులు చేయుచునెప్పుడు కోర్టులపాలయిబోకన్న॥ ఎల్ల॥
6. కూటికిగుడ్డకు లోటుచేసినీవు తాటికల్లు తాగకరన్న । నీబోటిజనులతో నాటకమాడుచు పూటలుగడపకుఓరన్న ॥ఎల్ల॥
7. పిల్లలనోటను మన్నుకొట్టినీవు కల్లుత్రాగకుర ఓరన్న । నీ కాళ్లు చేతులువంగిన వెనుక తొంగిచూచువా రెవరన్నా॥ ఎల్ల॥
8. చాలుచాలు చాలించుము నీవిఁక సందేహించకు రోరన్న । యీ నీలం వెంకయ్యదాసుని బోధలువింటే సుఖపడుదువురన్నా॥ ఎల్ల॥

### 8. కీర్తన.

త్రాగుడు పాపమురా। దానిస్నేహము చేయకురా।ఆరోగ్యంబులు దూరముచేసి రోగినిచేయునురా॥

1. తంటాల్ మారిదిరా । దానినంటిన దోషమురా। అంటుమారి నీ వెంటనెజేరి కంఠముగోయునురా॥ త్రాగు॥

2. సీటిజలగయదిరా । నినుపట్టుకు విడువదురా । దానిగుట్టు తెలిసిమది విడువనివారిని మట్టముచేయునురా॥ త్రాగు॥

3. త్రాచుపాము అదిరా । నినుగాచుకయున్నదిరా । దానివాసనగన్న వారికినెప్పుడు నాశనమేగదరా॥ త్రాగు॥

4. కుట్టేతేలదిరా । దాని ముట్టకదూరమురా । నీ యిష్టము వచ్చిన యట్టులుత్రాగిన కష్టము లధికమురా॥ త్రాగు॥

5. కోరలమెకమదిరా । నిను కొరికి చంపునదిరా। యిరుగు పొరుగుతో నిష్టము తప్పితె । యింతే నీగతిరా॥ త్రాగు॥
6. పెనుభూతంబదిరా । నీ ప్రాణముదీయునురా । యెన్నో కొంపలు ముంచినదానికి నీవనఁగ నెంతరా॥ త్రాగు॥
7. మంపేమంటదిరా । దాని యందన జేరకురా । నీ కండలుకాల్చి నిండుప్రాణములు । తీసెడి ముండదిరా॥ త్రాగు॥
8. అల్లరిజేయకురా । నీవు గుల్లయిపోదువురా । యీ నీలం వెంకయ్య వరదునిసాక్షిగ త్రాగుడు మానుమురా॥ త్రాగు॥

### 9. కీర్తన.

(నీకేల యీగండుతనము-మగడా అనుమాదిరి)

కల్లుత్రాగుట మానరాదా దానివల్ల కలిగెడి నష్టామెల్లా తెలిసియునీవు॥ కల్లు॥

1. ఇల్లాలనేడ్పించి పిల్లాలమాడ్పించి యొడలుతెలియక త్రాగియూగి। తల్లిదండ్రుల నడుమూడదన్ని । యెల్లవారిపై కలహమునకుదూకి। తెల్లవారడిగిన మూలనుండిరావు॥ కల్లు॥
2. మధుపానమూవల్ల బంధువులలో గోల పదుగురిలో బ్రతుకుబేల । బదులిచ్చినవారు తల్లడిల్ల । కొదువలేదని బహుహెచ్చు బల్కు ఎదురునాకెవ్వరని యెగసిపడుటసిగ్గు॥ కల్లు॥
3. కల్లుకిచ్చినయట్లు తల్లికీయవు ఛీ, ఛీ ఆలుపిల్లల నేడిపించి తూలి నేలపైపడువరకుత్రాగి । కూలిచాలకయాస్తి తెగనమ్మి ఓపలుగాకి నీస్థితినితలపఁ బోవిఁకనైన॥ కల్లు॥
4. ఏడాదికష్టించి కూడబెట్టినసొమ్ము తాటికల్లుకు ధారపోసి । మేడ మిద్దెల తెగనమ్మివేసి । కూడుగుడ్డకియ్యక యింట్లోమాడ్చి కడకు నిడుములుబడనేల బడవా తగదునీకు॥ కల్లు॥
5. నీజుట్టు నీచేతఁగొంచు । విడువు నీకింతపొగరేల యంచు।పాజీనాచే జిక్కితివిరారమ్ము । నీలోనీవే కలవరపడుట నమ్ము। గజబిజిపడి ఎంతకాలము బ్రతికెదవు॥ కల్లు॥



6. సారాద్రాగిన గుండెనీర్సమౌనండి । కారిజముతినివేయునండి ధర్మ మార్గమునకువ్యతిరేకమండి । బుద్ధికలతపడి తలదిరుగునండి। దారా పుత్రుల నేడ్పించుటతగదండి ॥క।

### 10. కీర్తన.

చుక్కా నీబొడ్డుపొక్క సురుకుచేయవే॥ రమ్ముచుక్కా కక్క ముక్క చీకుముక్క కాల్చిపెడతానే॥ రమ్ముచుక్కా॥

1. ఇరుగుపొరుగునవ్వనీ యీడువాళ్ళుతిట్టనీ । పరుగుపరుగు వచ్చినీదు పాలబడతానే॥ రమ్ముచుక్కా॥
2. పిల్లజల్లామాడనీ । పెండ్లముదెబ్బలాడనీ । కల్లుక్రింద నీక్రింద ఖర్చు పడతానే॥ రమ్ముచుక్కా॥
3. ముక్కుమూతి పగలనీ । ముందలపండ్లురాలనీ । తొక్కులాడి పోయిందాక దొర్లుతానే॥ రమ్ముచుక్కా॥

(మధుసేవ)

### 11. కీర్తన.

(సిరిసిరి మువ్వ అనే మాదిరి)

చాలుచాలునీస్నేహము రమ్ముసార । నీ గోలనేను పడలేనె రమ్ముసారా॥

1. అరువుచేసిమరువకుండ రమ్ముసారా । యెంతకలవైన త్రాగితినే రమ్ముసారా ॥చాలు॥
2. ఎంతపనిజేసితివే రమ్ముసారా । నన్ను గంతువేయించినావే రమ్ము సారా ॥చాలు॥
3. ముక్కుమూతి పగులదన్ని రమ్ముసార । నన్నుమూల గూర్చొబెట్టి నావే రమ్ముసారా ॥చాలు॥
4. ఇండ్లుభూములమ్మించి రమ్ముసార । నన్ను గల్లుమునింపిచినావే రమ్ముసారా ॥చాలు॥
5. మీసాలుదువ్వించి రమ్ముసార । నాకు గోచిగుడ్డపెట్టినావే రమ్ము సారా ॥చాలు॥

6. నిన్ను నమ్ముకున్నానే రమ్మసార । నన్ను మన్ను చేసిపోయినావే రమ్మసారా ॥చాలు॥
7. నీచాటుజొచ్చితినే రమ్మసార । నాకులోటు లేదనుకొన్నానే రమ్మసారా ॥చాలు॥
8. అగ్గిలాటి మొగ్గవని రమ్మసార । నిను మొగ్గులేక తాగినానే రమ్మసారా ॥చాలు॥
9. ఏనాడుపుట్టితివో రమ్మసార । నీవెన్ని కొంపలుముంచినావో రమ్మసారా ॥చాలు॥
10. నీలం వెంకయ్యవల్ల రమ్మసార । నీమహిమ యెల్ల తెలిసినదే రమ్మసారా ॥చాలు॥

## 12. కీర్తన.

(నల్లనయ్య నామీద దయలేదా అనురీతి)

సారా నీస్నేహము నాకు చాలుచాలునే రమ్మసారా॥ నీస్నేహము నాకు॥

1. అప్పుచేసి తప్పకుండ తాగుచుంటినే । చిప్పచేతికిచ్చి చెప్పకుండ పోతివే॥ రమ్మసారా॥
2. కక్కముక్క చీకుముక్క కాల్చి పెట్టితినే । ముక్కమూతిపగలదన్ని పారిపోతివే ॥రమ్మసారా॥
3. లక్షలాదిధనమునీకు ఒప్పగించితే । ఉప్పులేని గంజి తాగి పడలిపోతినే॥ రమ్మసారా॥
4. గుండెలుబ్బజేసి నన్ను పండబెట్టితే । తిండిలేక గురకపుట్టి యెండిపోతినే॥ రమ్మసారా॥
5. దిక్కునీవేయనుచు రొక్కమప్పగించితే । నాపక్కగుడ్డ లేకుండ చేసిపోతివే॥ రమ్మసారా॥
6. లేనిపోనిరోగాలెన్నొ తెచ్చిపెట్టితే । ఏనుగలాటివానిని నన్ను పీనుగు చేస్తివే ॥రమ్మసారా॥
7. ఒడలునిల్లామరచి త్రాగిపండుకొంటినే । నాపడతియేమైపోయెనో తెల్లవారితెలిసెనే ॥రమ్మసార॥



[illegible]గుడ్డలు వేషమునాకు సంకనుపెట్టి [illegible]వంకర నడకలతో [illegible] వంగదీసితే॥ రమ్మసార॥
9. కూటికిన్నిగుడ్డకును లోటుచేసితే । సూటిగ నీలం వెంకయ్య బాట దొరకెనే॥ రమ్మసార॥

## 13. కీర్తన.

(అత్తవారింట కాపురము చేయలేక తల్లితో మొరబెట్టుకొనుట.)

(ఏకేలయీ గండుతనము అనుమాదిరి)

నేనెట్లు కాపురము చేతునే । అమ్మ నేనెట్లు కాపురము చేతునే నాదెసకొందిని దొరికాడు పుసికండ్ల మొగడు॥ నాకెందుకీకాపురంబు॥

1. ఇరుగు పొరుగిండ్లాకు నాయిష్టమున్నట్లు । యింటింట ననుతిరుగనీయడు । పరపురుషులతో మాటాడనీయడు । పొరుగు వారితో పోరాడనీయడు ! ఆహా! యీటుపద్రమే సేనెన్నడెరుగను ॥నేనెట్లు॥
2. గయ్యాళిమాయత్త యిల్లాలునేనింట నెల్లకాలము పోరుజంటా । గూడి యాడుచుందురు నావెంట । యెల్ల కాలమీకొంపలో నింక । వల్లనీమగడు నాకేలనింక । యీయల్లరికాపురము ఎన్నాళ్లునేచేతు ॥నేనెట్లు॥
3. గడుసుమరదులుచూడు । గయ్యాళిమావదిన । యెప్పుడు పోరాడుతారు । మగనిచేచెప్పి కొట్టించుతారు । ఇంటనుండ నొల్లదు పొమ్మంటారు । నేను పండుకొని యుంటేను । మండిపడి పోతారు ॥నేనెట్లు॥
4. ఇంటిపనులనెల్ల నొంటరిగానేజేసి వంటలన్నీ వండలంట। వండిఅందరికి వడ్డించలంటా । మిగిలితే వెనుక నేతినవలెనంటా । ముందుగానేను తింటేనుతంటా । యీమెంగీలికూటికి యెన్నాళ్ళునేనుందు॥నేనెట్లు॥
5. తెల్లవారగలేచి యిల్లుగుమ్మామూడ్చి కల్లాపు నేజల్లాలంట ॥ ముగ్గులన్నీ నేనెపెట్టలంటా । యింట్లోనీళ్ళన్ని నే తేవలంట । బట్టలన్ని నేనే యుతకాలంటా । ముఖముకడిగి బొట్టుపెట్టాలంటా। యీనీలం వెంకయ్యదాసు వరదుల నమ్మాలంటా ॥నేనెట్లు॥

## 4. కీర్తన.

(వద్దురా మనకొద్దురా పరిపాలనంబిక వద్దురా అనుమాదిరి)

వద్దురా మనకొద్దురా యీమద్యపానము వద్దురా । ఎందరెందరో
దీనినుందర చిందులాడి నశించెరా॥

1. మానప్రాణములన్ని హరియించేటి మహామ్మారిరా । నీతనువు
శాశ్వతమనుచునమ్మి త్రాగిపడిచెడిపోకురా॥ వద్దు॥

2. ఉన్నభూములు అమ్మించి కన్నమేయిస్తుందిరా । అన్నహారము లేక
వీధుల వెంట త్రిప్పిస్తుందిరా॥ వద్దు॥

3. ముంతకల్లు త్రాగినప్పుడు గంతులేయిస్తుందిరా । నీ చెంతనున్న
వారితోటి సికలుపట్టిస్తుందిరా॥ వద్దు॥

4. తన్నులాటల తల్లిరా తప్పించుకుంటే మేలురా । ఎన్నికొంపలు
మన్నుచేసి నిన్నుజూడగ వచ్చెరా॥ వద్దు॥

5. ఎల్లకాలము త్రాగుచుంటే యిల్లువళ్ళు గుల్లరా । నీముల్లెమూట
లన్నికల్లుపాకలో హరియించురా॥ వద్దు॥

6. గుండెలుబ్బగ జేయురా అతిగురకపట్టి తపించురా । తిండిహిత
వనకుండజేసి నిండుప్రాణము దీయురా॥ వద్దు॥

7. తల్లిపిల్లలుగోలరా చాలించుకల్లిక మానరా । నీకు మేలుచెప్పెడు
వారినెప్పుడు తూలనాడగబోకురా॥ వద్దు॥

8. జ్ఞాపకంబరియించురా బహు కోపమధికం బౌనురా । రేపుమాపు
యనక నెప్పుడు తోపులాటల గోలరా॥ వద్దు॥

9. మెదడునంతయు పాడుచేసి వదరుపోతును జేయురా । పెద్దచిన్నల
గురుతులేకను హద్దు తప్పిస్తుందిరా॥ వద్దు॥

10. ఎవరునాతో సాటిలేరని యెగిరిపడి చెడిపోకురా । శవమురీతిగ
మొక్కడోపడి కండ్లుమూయగ బోకురా॥ వద్దు॥

11. ధరణిలో నీలం వెంకయ్యబాసు దెల్పినబోధరా । మరువకుండగ
విన్నవారికి కరువుబాధిక లేదురా॥ వద్దు॥

# శ్రీ పాండురంగ ముద్రాక్షరశాల, ఏలూరు.

ఇందు పలువిధములగు కార్డులు, కవర్లు, విజిటింగుకార్డులు, లెటరుపేపర్లు, హుండీఫారములు, కోర్టుఫారములు నోటీసులు, బుక్కు-వర్కు, వాల్ పోస్టర్లు, శుభలేఖలు, బైండుపనులు, సరసమయిన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము. ఒకసారి ఆర్డరిచ్చిన మీకే తెలియగలదు.